కేళీ.. ఇదో రకం మోళీ



కొత్తపేటలో కేళీ విత్తనాలతో పెరిగిన వరి చేను

- కోమలి 1,318 రకం వరి విత్తనాల్లో కలసిన మరో రకం
- కొత్తపేట మండలంలో 600 ఎకరాల్లో రైతులకు నష్టం

కొత్తపేట: సాగులో అన్నీ ఆటంకాలే.. విత్తు నుంచి పంట చేతికి వచ్చే వరకూ ఇబ్బందులే.. ఎన్నో ఆశలతో సాగు చేపట్టిన వరి పంటలో మూడొంతులు ఒక రకం, ఓ వంతు వేరే రకం (కేళీలు) పండడంతో రైతులు నోరెళ్లబెడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ (తొలకరి) సీజన్ వరి పంట సాగులో అధిక దిగుబడులు వస్తాయని ఒక వరి రకాన్ని కొనుగోలు చేసి పండించారు. తీరా ఈనిక దశ వచ్చేసరికి కేళీల రకం వరి ముందుగా, అసలు రకం వరి తరువాత ఈనింది. ఆ విధంగా మూడో వంతు నష్టం వచ్చిందని పలువురు రైతులు వాపోయారు. కొత్తపేట మండల పరిధిలోని రైతులు ఎంటీయూ 7,029 (స్వర్ణ), ఎంటీయూ 1,318 రకాలు సాగు చేశారు. ఇందులో కొందరు తమ సొంతంగా కట్టిన విత్తనాలు, మరి కొందరు ఇతర రైతుల వద్ద, మరికొందరు స్థానిక ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేశారు. ఇందులో భాగంగా 'కోమలి 1,318' అనే వరి రకం పండించిన కొందరు రైతుల చేలల్లో వేరే రకం (కేళీలు) కలిశాయి. సుమారు నెల క్రితం చేను అంతా ఒకేసారి ఈనకుండా మధ్య మధ్యలో సుమారు మూడొంతుల్లో ఒక వంతు మేర వేరే రకం వరి ఈనేసింది. మిగిలిన రెండు వంతులు ఈనకుండా పాలుపోసుకుంటుంది. ఈ రకం విత్తనాలు వరి పండించిన రైతులు మా చేను కూడా అలాగే రెండు రకాలుగా ఉందని ఆయా రైతులు వాపోయారు. కొత్తపేట శివారు చినగూళ్లపాలెం, పెదగూళ్లపాలెం, పనసలదొడ్డి ప్రాంతాలు, మండలంలోని అవిడి, పలివెల, ఖండ్రిగ, రావులపాలెం మండలం దేవరపల్లి శివారు మట్లదొడ్డి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సుమారు 600 ఎకరాల్లో సాగు చేశారు. ఈ విత్తనాలను స్థానిక సిరి సంపద సీడ్స్ విత్తనాల షాపులో తెలంగాణకు చెందిన యాగంటి ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి 'కోమలి 1318' అనే వరి రకం విత్తనాలు 20 కిలోల ప్యాకెట్ రూ.1,500 చొప్పున కొనుగోలు చేశారు. కేళీల సమస్యను బాధిత రైతులు సంబంధిత డీలర్ ద్వారా కంపెనీ దృష్టికి తీసుకువెళ్లారు. కంపెనీ తరఫున సిబ్బంది వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వెళ్లారు. ఇది జరిగి సుమారు నెల రోజులుగా నడుస్తుంది. కానీ ఇంతవరకూ రైతులకు జరిగిన నష్టంపై తగిన హామీ మాత్రం ఎవరూ ఇవ్వలేదు. ఐ.పోలవరం మండలంలోని సుమారు 50 ఎకరాల్లో ఇదే రకం విత్తనాల్లో కేళీల సమస్య ఏర్పడినట్లు తెలిసింది. అయితే బాధిత రైతులకు న్యాయం చేకూర్చేలా కంపెనీ, డీలర్ హామీ ఇచ్చినట్టు సమాచారం. కొత్తపేటలో మాత్రం సుమారు 20 రోజులుగా ఏ విధమైన హామీ లభించకపోవడంతో మంగళవారం సుమారు 30 మంది రైతులు అమలాపురం వచ్చిన రాష్ట్ర మంత్రి కె.అచ్చన్నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. న్యాయం జరగకపోతే ఆందోళన చేపడతామని అన్నారు.



కొత్తపేటలో కేళీల వరి చేను పరిశీలిస్తున్న ఏడీ పద్మలత

నష్ట పరిహారం చెల్లించాలి



నేను 2.2 ఎకరాల విస్తీర్ణంలో కోమలి 1,318 రకం వరి సాగు చేశాను. సుమారు 30 వేలు పెట్టుబడి పెట్టాను. తీరా ఈనిక దశ వచ్చేసరికి ఒకదాని తరువాత ఒకటిగా రెండు రకాలు ఈనాయి. సాధారణంగా ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తాయి. కానీ ఇప్పుడు కేళీల కారణంగా 10 బస్తాలకు పైగా దిగుబడి తగ్గి, సుమారు రూ.15 వేల నష్టం వస్తుంది. దీనికి సంబంధిత కంపెనీ బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలి.

– దూనబోయిన హరినాథ్, కౌలురైతు, పెదగూళ్లపాలెం, కొత్తపేట

ఎకరానికి 10 బస్తాల నష్టం



నేను 1.5 ఎకరాల్లో కోమలి 1,318 వరి రకం సాగు చేశాను. ఆ విత్తనాలు స్థానిక సిరిసంపద విత్తనాల షాపులో ప్యాకెట్ రూ.1,500కు కొనుగోలు చేశాను. మొత్తం చేనంతా కేళీలే. మూడు వంతుల్లో రెండు వంతులు 1,318 రకం కాగా, మరో వంతు వేరే రకం. అది ముందుగా ఈనిక రాగా అసలు విత్తనం తరువాత ఈనింది. ఇది కోతకు వచ్చే సమయానికి కేళీ రకం రాలిపోతుంది. ఈ విధంగా సుమారు 10 బస్తాల దిగుబడి తగ్గింది.

– అప్పారి వీరవెంకట సత్యనారాయణ, కౌలు రైతు, చినగూళ్లపాలెం

చర్చించి చర్యలు తీసుకుంటాం



వరిలో కేళీల సమస్యపై ఇప్పటికే తాను విత్తన కంపెనీ ఆర్ఎంతో మాట్లాడాను. రైతులు, కంపెనీ ప్రతినిధులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం. రైతులు 10 బస్తాలు నష్టం వస్తుందంటున్నారు. కంపెనీ వారు 2, 3 బస్తాలు మాత్రమే అంటున్నారు. ఎంత నష్టం అనేది నిర్ధారించాల్సి ఉంది. ఏదేమైనా డీలర్‌కు షోకాజ్ నోటీస్ ఇస్తాం. వ్యవసాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తాం.

– ఎం.వెంకటరామారావు, ఏడీఏ, కొత్తపేట

కేళీలు వాస్తవమే..



ఈ సీజన్‌లో కోమలి 1,318 రకం విత్తనాల్లో కేళీలు వాస్తవమే. ఆ రకం 700 ప్యాకెట్లు వచ్చాయి. వాటిలో 23ఆర్- 31351 బ్యాచ్ లాట్ 350 ప్యాకెట్స్ విత్తనాల్లో కంప్లైంట్ వచ్చింది. రైతుల ఫిర్యాదు మేరకు కంపెనీ దృష్టికి తీసుకువెళ్లాం. కంపెనీ ప్రతినిధులు వచ్చి ఫీల్డ్ విజిట్ చేశారు. నష్ట పరిహారం విషయం పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

– బొలిశెట్టి చిట్టిబాబు, డీలర్, సిరి సంపద సీడ్స్, కొత్తపేట

క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠ పూజలు



పుల్లేటికుర్రులో పూజలు చేస్తున్న పండితులు

అంబాజీపేట: పుల్లేటికుర్రులో అభయాంజనేయ స్వామివారి 27 అడుగుల విగ్రహ ఆవిష్కరణ మహోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీనివాసుల విజయ్ గోపాలాచార్యులు బ్రహ్మత్వంలో గ్రామస్తులచే స్వామివారికి పూజలు చేయించారు. ప్రతిష్ఠ సంకల్పం, అకల్మష హోమం, చతుర్వేద స్వస్తి, యాగశాల ప్రవేశం, యాగ మందిర పూజ, అంకురార్పణ, వాస్తుపూజ, వాస్తు హోమాలను నిర్వహించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



ఊడిమూడిలో రామలింగేశ్వరస్వామి

పి.గన్నవరం: ఊడిమూడి గ్రామంలో వేంచేసిన పార్వతీ రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా బుధవారం లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ కుమారస్వామి తదితరులు

అయినవిల్లి: ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో చదువుతున్న విద్యార్థులు టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరిచారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండలోని శ్రీఎస్‌వీకేపీ కేఎస్‌రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన ఇంటర్ కాలేజియేట్ టేబుల్ టెన్నిస్ మెన్ టోర్నమెంట్‌లో దంగేటి నవీన్ కుమార్, కర్రి వెంకటేశ్వర్లు, ఎండీ ఫిరోజ్‌లు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని కళాశాల డైరెక్టర్ వై.కుమారస్వామి, ప్రిన్సిపాల్ వి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

12న పురస్కారాల ప్రదానం



పురస్కారాల ప్రదానోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు

పి.గన్నవరం: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న పి.గన్నవరం సాయితేజ విద్యా సంస్థల ప్రాంగణంలో గద్దర్ జాతీయ సేవా పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందని మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను బుధవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వారికి ఈ అవార్డులు అందించనున్నట్టు జాన్ వివరించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ కుమార్తె వెన్నెల ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



గొందిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

సఖినేటిపల్లి: గొంది, అంతర్వేదికర గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో అధికారులు సమావేశాలు నిర్వహించారు. వరి పంటపై ఆశించే తెగుళ్లు, వాటి నివారణ, తక్కువ పెట్టుబడితో అధిక లాభాల గురించి ఏఓ పీవీ నరసింహారావు వివరించారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

అంబాజీపేట: సేంద్రియ విధానంలో సాగు చేస్తే మానవాళికి మేలు జరుగుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ మహిళా రైతుల వ్యవసాయ ఉత్పత్తుల సహకార సంఘం ఆధ్వర్యంలో అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఇంద్రశేఖర్ మాట్లాడుతూ సహజ సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులను తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్ర మార్కెట్ ట్రైనర్ జె.నాగవేణి మాట్లాడుతూ ప్రకృతి సహజ సిద్ధంగా పండించిన పంటలను మార్కెట్‌కు తరలించి వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పండించిన కూరగాయలను తీసుకోవడం ఎంతో మేలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణ, పొలం గట్లపై కూరగాయలను పండించుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, పోషక విలువలున్న కూరగాయలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, సూదాబత్తుల రాము, మైలా ఆనందరావు, జల్లి ఏడుకొండలు పాల్గొన్నారు.



అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద సేంద్రియ కూరగాయలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

లోక కల్యాణార్థం పుణ్యక్షేత్రాల సందర్శన

సఖినేటిపల్లి: హిందూ సనాతన ధర్మాన్ని రక్షించడానికి, లోక కల్యాణార్థం ప్రతి పుణ్యక్షేత్రానికి వెళ్లి స్వామివార్లను దర్శించుకుంటున్నట్టు మహిళా అఘోరా అన్నారు. బుధవారం మలికిపురం నుంచి అంతర్వేది పుణ్యక్షేత్రానికి ఆమె చేరుకున్నారు. అంతర్వేదిలో లక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్నారు. మన పిల్లలను మనమే కాపాడుకోవడమే పెద్ద లోక కల్యాణమని అన్నారు. గో హత్యలు ఆపాలని, ఆడ పిల్లలపై అఘాయిత్యాలు అరికట్టాలని, ఆలయాలపై దాడులు ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మూడు సంకల్పాలపై ఒంటరి పోరాటం చేస్తున్నానని, అదే తన లోక కల్యాణం అని ఆమె అన్నారు. ధర్మం గురించి అందరం కలసికట్టుగా పోరాడదామని, అలాగే ధర్మపథంలో అందరినీ నడిపిద్దామని హితవు పలికారు.



అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మహిళా అఘోరా

పోలీస్ శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

రావులపాలెం: జిల్లాలో పోలీస్ శాఖలో సిబ్బంది కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. రావులపాలెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని ఐజీ అశోక్ కుమార్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బీవీ కృష్ణారావుతో కలసి బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అమలాపురం, రావులపాలెంలలో ట్రాఫిక్ ఇబ్బందులు తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు, నేరాలు అరికట్టడంలో భాగంగా గౌతమి, వశిష్ఠ గోదావరి నదులపై ఉన్న గోదావరి బ్రిడ్జిల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అధికారులను సమన్వయం చేస్తూ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని రకాల నేరాలు, ట్రాఫిక్ సమస్యల నిర్మూలనకు ఉమ్మడి గోదావరి జిల్లాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. రావులపాలెం స్టేషన్‌కు సీసీ ఎస్సైను అదనంగా ఇస్తామన్నారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు, సీఐలు విద్యాసాగర్, కిశోర్‌బాబు, ఎస్సైలు సురేంద్ర, అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం రూరల్ సర్కిల్ స్టేషన్‌లో ఐజీ అశోక్‌కుమార్

భారీ తాచుపాము హల్‌చల్



తాచుపామును బంధిస్తున్న విష్ణు

మామిడికుదురు: పాశర్లపూడిలంక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఇంట్లో భారీ తాచుపాము బుధవారం హల్‌చల్ చేసింది. బొరుసు బాబి ఇంట్లో నక్కిన తాచుపామును పాశర్లపూడి కొట్టుమెరకకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ విష్ణు చాకచక్యంగా పట్టుకున్నారు. దాన్ని సంచిలో బంధించి నిర్జీవ ప్రాంతానికి తీసుకు వెళ్లి అక్కడ విడిచి పెట్టారు. రెండో రోజుల కిందట తాచుపాము ఇంట్లో ప్రవేశించి బాబి కుటుంబ సభ్యులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసిందని స్థానికులు తెలిపారు. అనుమానం వచ్చి గాలించగా బుధవారం దాని ఆచూకీ లభ్యమైందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఉపాధ్యాయులు

సఖినేటిపల్లి: ఏపీ శాప్ ఆధ్వర్యంలో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం జరిగిన ఆల్ ఇండియా రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలానికి చెందిన ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు మరో మండలానికి చెందిన ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు విజయం సాధించారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పైముగ్గురు అర్హత సాధించారు. 200 మీటర్ల పరుగు పందెంలో వాసాలతిప్ప జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మల్లాడి సురేష్ బాబు ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్ ఈవెంట్‌లో జీవీ పుంత జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన కొల్లు సతీష్ కుమార్ ప్రథమ, గొంది జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన దాసరి జయప్రకాష్ తృతీయ స్థానం సాధించారు. వీరిని ఎంఈవో-1, 2 డి.కిశోర్‌కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు దివ్విప్రసాద్, ఎస్.సత్యనారాయణ అభినందించారు.



గుంటూరులో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులు

అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన

రావులపాలెం: షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అత్యాచార నిరోధక చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హాన్ అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో ఏపీ క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే నేరాలు, నేరాలకు గురైన బాధితులకు పరిహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ గోవిందరావు, తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ అధికారి హేమలత, దళిత బహుజన శ్రామిక యూనియన్ సెక్రటరీ శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ అస్మ ఫర్హాన్

కొత్తపేట డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట: ఆదికవి నన్నయ యూనివర్సిటీ (అక్నూ) బాక్సింగ్ మెన్ టీమ్ ఎంపికకు నిర్వహించిన పోటీల్లో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. 2024–25 సంవత్సరానికి అక్నూ ఇంటర్ కాలేజియేట్, ఇంటర్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్ బాక్సింగ్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ టోర్నమెంట్ పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో మంగళ, బుధవారాలు నిర్వహించారు. ఇందులో స్థానిక డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థి సీహెచ్ పృథ్వీరాజ్ బాక్సింగ్ మెన్ 60- 63.5 కిలోల కేటగిరీలో గోల్డ్ మెడల్ సాధించి, అక్నూ టీమ్‌కు సెలక్ట్ అయ్యాడు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థి బి.ప్రభాస్ బాక్సింగ్ మెన్ 54–57 కిలోల కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ టీ రమాదేవి, పీడీ కనకరాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు.



విజేతలు పృథ్వీరాజ్, ప్రభాస్‌లతో పీడీ కనకరాజు

టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆలమూరు: నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించడం ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సువర్చలాదేవి, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు వేశారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు వైద్య సేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజక్షన్లు చేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హైపటైటీస్ బీ వ్యాక్సిన్లను అందజేశారు.



పెనికేరులో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

తొలగించిన వీఓఏపై ఫిర్యాదులు

మలికిపురం: పడమటిపాలెం గ్రామంలో వెలుగు అధికారులు తొలగించిన వీఓఏ యడ్ల సుమలత అక్రమాలపై మరో రెండు మహిళా సంఘాల సభ్యులు ఎంపీడీఓ ఎస్.బాలాజీకి ఫిర్యాదు చేశారు. తన అక్కౌంట్ నుంచి పొదుపు సొమ్ము, సంక్షేమ పథకాల సొమ్ము డ్రా చేసి సుమలత తీసుకుందని గ్రామానికి చెందిన స్రవంతి మహిళా సంఘ సభ్యురాలు మంద వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాము బ్యాంకు స్టేట్‌మెంట్లు తీసి నిలదీస్తే ఆ సొమ్ములు తనవని, తమకు సంక్షేమ పథకాల సొమ్ము రాలేదని బెదిరిస్తుందని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. అలాగే గ్రామానికి చెందిన క్రాంతి మహిళా సంఘ సభ్యులు కూడా మరో ఫిర్యాదు చేశారు. తమ గ్రూపులో బినామీ సభ్యురాలిగా ఉన్న సుమలత తమ గ్రూపు ద్వారా రూ.70 వేలు తీసుకుని చెల్లించకుండా, తమ పొదుపు సొమ్ము నుంచి రుణం చెల్లించిందని ఫిర్యాదు చేశారు. అలాగే తమ గ్రూపులో 60 ఏళ్లు నిండిన కొప్పాడి శశిరేఖను గ్రూపు నుంచి తొలగించి ఆమెకు రావాల్సిన రూ.28 వేల పొదుపును ఆమెకు ఇవ్వకుండా సుమలత కాజేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆలమూరు మండల అధికారుల ఫోన్ నంబర్లు

అధికారి పేరు	హోదా	ఫోన్ నంబరు
కేజే ప్రకాష్‌బాబు	తహసీల్దార్	98499 03902
సీహెచ్ విద్యాసాగర్	రావులపాలెం రూరల్ సీఐ	94407 96537
ఎం.అశోక్	సబ్ ఇన్‌స్పెక్టర్	94409 04849
ఎ.రాజు	ఇన్‌చార్జి ఎంపీడీఓ	83175 42815
ఎల్.అనిత	వెటర్నరీ ఏడీ	95503 93727
ఎ.రాజు	ఈఓపీఆర్డీ	83175 42815
కె.నాగేశ్వరరావు	ఏడీఏ	83310 56664
ఎస్.లక్ష్మీలావణ్య	మండల వ్యవసాయాధికారి	83310 56557
ఐడి.నాగేశ్వరరావు	ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్	97012 87828
జి.అరుణకుమారి	ఎస్ఆర్‌జీఈఎస్ ఏపీఓ	70933 23644
ఎం.ధనరాజు	వెలుగు ఏపీఎం	98499 01696
డి.శ్రీనివాస్	హౌసింగ్ జేఈ	70939 30448
బి.అప్పాజీ	ఎంఈఓ- 1	80748 05733
కేవీ సుబ్బరాజు	ఎంఈఓ- 2	96189 37973
పి.పద్మ	ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ	91001 21135
పి.శారద	సీడీపీఓ, కొత్తపేట	94408 14683
డి.సువర్చలాదేవి	చొప్పెల్ల పీహెచ్‌సీ	70136 40523
పి.భవానీశంకర్	పెదపళ్ల పీహెచ్‌సీ	88017 87816
టి.కృష్ణ త్రిమూర్తులు	ఇరిగేషన్ జేఈ	83286 29109
జి.భానుప్రసాద్	పశువైద్యాధికారి	95332 87404
పి.రాంబాబు	ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్	91609 88844
టీఎస్‌వీ నాగలక్ష్మి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్	63099 39852
వై.అరుంధతి	ఐసీడీఎస్ సూపర్‌వైజర్	89778 30575
పి.గోపిరామ్	ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి	93467 87187
డి.వీరభద్రరావు	మండల ఇంజినీరింగ్ జేఈ	83175 43987
వి.వెంకటరమణ	ఆర్అండ్‌బీ జేఈ (మండపేట)	94408 18537
జి.కోటేశ్వరరావు	ఉద్యాన శాఖాధికారి	87126 25210
కె.శివ నాగమల్లేశ్వరరావు	కార్మిక శాఖాధికారి	94925 55059
డీఎస్ఎన్ మూర్తి	అటవీ శాఖాధికారి	98493 52664
పేపకాయల భాస్కరరావు	ఆర్టీసీ డిపో (ఆర్‌సీపురం)	73828 25536
కేడీఎస్ఎన్ కుమార్	ఆర్టీసీ డిపో (రావులపాలెం)	99592 25537
డీఎంకే దుర్గాప్రసాద్	ట్రాన్స్‌కో ఏఈ (ఏపీఈపీడీసీఎల్)	94408 12601
సాయి చంద్రిక	డ్రైన్స్ ఏఈ	88860 66939

కోకో పార్క్ ఏర్పాటుకు స్థల పరిశీలన



తూర్పుపాలెంలో కోకో పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: తూర్పుపాలెంలో కోకో పార్కు ఏర్పాటుకు బుధవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్థల పరిశీలన చేశారు. సముద్ర తీరంలోని సొసైటీ భూములను పరిశీలించి అనువుగా ఉంటుందన్నారు. పార్కు ఏర్పాటుకు దాదాపు 25 ఎకరాల భూమి అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దీనిని ఏర్పాటు చేసున్నామన్నారు. 9న సొసైటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వివరించారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే అన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈసీ నిధుల ద్వారా మంజూరైన రూ.43.10 లక్షలతో దిండిలో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.